# ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను గడువులోపు పూర్తి చేయండి

### జిల్లా స్కిల్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా మార్చి 31:**



జిల్లాలో అమలు జరుగుతున్న వివిధ నైపుణ్యాభివృద్ధి (స్కిల్ డెవలప్మెంట్) శిక్షణ కార్యక్రమాలకు సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను గడువులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పరిశ్రమలు మరియు ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశంలో భాగంగా జిల్లా స్కిల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా పరిశ్రమల మేనేజర్ మహబూబ్ బాషా, డిఆర్డిఏ పిడి శ్రీధర్ రెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణరెడ్డి, ఎల్‌డీఎం రవీంద్ర కుమార్, ఉద్యాన శాఖ అధికారి నాగరాజు తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో అమలు జరుగుతున్న వివిధ నైపుణ్యాభివృద్ధి (స్కిల్ డెవలప్మెంట్) శిక్షణ కార్యక్రమాలను ప్రభుత్వం నిర్దేశించిన గడువు లోపు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఉన్న స్కిల్ హబ్‌లు, జాబ్ మేళాల నిర్వహణ, వాటి ప్రగతి వంటి అంశాలను సమీక్షించారు. ముఖ్యంగా పీ ఎం విశ్వకర్మ, సీడాప్ ( సి ఈ డి ఏ పి), ఇతర స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ కార్యక్రమాల అమలు స్థితిని సమీక్షించారు. జిల్లాలో జరుగుతున్న అన్ని శిక్షణ కార్యక్రమాలు ఎటువంటి అంతరాయం లేకుండా సమర్థవంతంగా నిర్వహించాలనీ, లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# భూసమస్యల పరిష్కారంలో నాణ్యత పెంచి ప్రజా సంతృప్తిని మెరుగుపరచాలి

### జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా మార్చి 31:**

జిల్లాలో భూసంబంధిత సమస్యలను నాణ్యతతో, పారదర్శకంగా పరిష్కరించి ప్రజల సంతృప్తి స్థాయిని పెంపొందించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం అమరావతిలోని భూపరిపాలన ప్రధాన కార్యాలయం నుంచి భూపరిపాలన ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భూసంబంధిత అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో నంద్యాల జిల్లా నుంచి ఎన్‌ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, సర్వే ఏడీ శ్రీరాం మోహన్ తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం భూసమస్యల సమగ్ర పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ పలు చర్యలు తీసుకుంటోందన్నారు. ఇప్పటికే పరిష్కరించిన భూసంబంధిత అర్జీలపై లబ్ధిదారుల నుంచి అభిప్రాయాలను సేకరించి, వారి సంతృప్తి స్థాయిని అంచనా వేయాలని సూచించారు. ఎక్కడైనా అసంతృప్తి వ్యక్తమైతే, వాటిని మరింత సమర్థవంతంగా పరిష్కరించే విధంగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న 'రెవెన్యూ క్లినిక్స్' ద్వారా ప్రజల నుంచి వచ్చే భూ సంబంధిత ఫిర్యాదులను సమగ్రంగా పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించి, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సేవలను మెరుగుపరచాలని సూచించారు. అంతకుముందు భూపరిపాలన ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి మాట్లాడుతూ, ఐవిఆర్ఎస్ ద్వారా పొందుతున్న ప్రజా స్పందనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, వచ్చిన అభిప్రాయాలను విశ్లేషించి సేవల నాణ్యతను పెంపొందించేందుకు కృషి చేయాలని సూచించారు.

# విపత్తు నివారణకు పకడ్బందీ చర్యలు తప్పనిసరి

### జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి






**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా మార్చి 31:** విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ముందస్తు సన్నద్ధతతో పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత శాఖ అధికారులకు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో 2026 సంవత్సరపు మొదటి విడత విపత్తు నిర్వహణపై నిర్వహించిన సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ తోగట ప్రియాంకతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఏర్పడే కరువు పరిస్థితులు కూడా విపత్తులలో భాగమేనని పేర్కొన్నారు. విపత్తు సంభవించిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే, ముందస్తు ప్రణాళిక మరియు సన్నద్ధత అత్యంత కీలకమని స్పష్టం చేశారు. వర్షాభావ పరిస్థితుల్లో పంటలను ఎలా రక్షించుకోవాలో రైతులకు తగిన మార్గదర్శకాలు ఇవ్వాలని, భూగర్భ జలాల లభ్యత తగ్గే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని హార్టికల్చర్ మల్చింగ్ వంటి పద్ధతులను ప్రోత్సహించాలని సూచించారు. పంట నష్టం సంభవించిన వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు భరోసా కల్పించాలన్నారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, పశువుల కోసం ఏర్పాటు చేసిన నీటి తొట్టెల వద్ద ఎలాంటి లీకేజీలు లేకుండా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. వేసవికాలంలో అగ్నిప్రమాదాల ప్రమాదం ఎక్కువగా ఉండే నేపథ్యంలో అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాబోయే మూడు నెలల్లో ఉపాధి హామీ పథకం ద్వారా ఫీడర్ ఛానల్స్ శుభ్రపరిచే పనులు, పూడికతీత వంటి పనులను పూర్తి చేయాలని పేర్కొన్నారు. చెరువుల కట్టల్లో ఏర్పడిన గండ్లు, ఇతర నష్టాలను తక్షణమే మరమ్మత్తు చేయాలని, రోడ్లు మరియు భవనాల శాఖ, పంచాయతీ రాజ్ శాఖలు అవసరమైన పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అలాగే ఆపద మిత్ర వాలంటీర్లకు శిక్షణ అందించి, విపత్తుల సమయంలో వారి సేవలను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. విపత్తుల సమయంలో ప్రజలకు అండగా నిలవడం అధికారుల ముఖ్య బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. ముఖ్యంగా ఏప్రిల్, మే, జూన్ నెలల్లోనే చెరువుల కట్టలను బలోపేతం చేయడం, పిచ్చి మొక్కలను తొలగించడం వంటి ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే గతంలో కొన్ని విపత్తుల సందర్భాల్లో అధికారుల స్పందన తగిన స్థాయిలో లేకపోవడం గమనించామని, అవగాహన లోపం మరియు సమన్వయాభావం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయని విమర్శించారు. జల్కనూరు టాంక్ ఘటనను ఉదాహరణగా ప్రస్తావిస్తూ, సమాచారం అందినా సమయానికి స్పందించలేదని పేర్కొన్నారు.